క్లుప్తంగా

రేపటి కేయూ బంద్ వాయిదా

కేయూ క్యాంపస్: యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్‌కు కేయూ భూములు కేటాయిస్తూ పాలక మండలి తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న తలపెట్టిన కేయూ బంద్‌ను వాయిదా వేస్తున్నట్లు డీఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఎస్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, ఏఐడీఎస్‌ఓ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్, బీఆర్‌ఎస్‌వీ నాయకులు వస్తం అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు ఉన్న నేపథ్యంలో బంద్‌ను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను కాకతీయ యూనివర్సిటీలో భూమిలో కాకుండా బయట ప్రభుత్వ భూముల్లో నిర్మించాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. అజరా ఆస్పత్రి, ములుగు రోడ్డు, ఎస్‌వీపీ రోడ్డు, న్యూ కాపువాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

20న కవితా సంపుటి ఆవిష్కరణ

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని నారాయణ కళాశాలలో ఈ నెల 20న ఉదయం ఉజ్వల సాహితీ సాంస్కృతిక సమితి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రచయిత శనిగరపు రాజ్‌మోహన్ తెలిపారు. చిమ్నీల వెలుగులు అనే లఘు కవితా సంపుటిని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ ఆవిష్కరించనున్నారని, ప్రొఫెసర్ బన్న అయిలయ్య, ప్రొఫెసర్ తాటికొండ రమేష్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్, పెద్ది ఆంజనేయులు తదితరులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

యువత దేశభక్తి కలిగి ఉండాలి



హన్మకొండ అర్బన్: యువత దైవభక్తితో పాటు దేశభక్తి కలిగి ఉండాలని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఏషియన్ మాల్ సమీపంలోని సాయిబాబా గుడిలోని సాయినాథుడిని గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మందిర చైర్మన్ హరగోపాల్, ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, వెయ్యిగండ్ల రమేష్.. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రాజు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



మడికొండ: వరంగల్ 46వ డివిజన్ మడికొండలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వస్కుల నాగరాజు, శివ, గుర్రం అమర్‌నాథ్, పల్లపు రాజు, వినయ్, శ్రీను, సంపత్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు సన్మానం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ బదిలీపై పరీక్షల విభాగానికి వెళ్తున్న జగన్‌ను కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బిక్షాలు, ఉద్యోగులు గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వీరన్న, ఉద్యోగులు డాక్టర్ శాగంటి శ్రీనివాస్, లావణ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యమాలకు తీరని లోటు

న్యూశాయంపేట: ప్రభంజన్ యాదవ్ మృతి బీసీ ఉద్యమాలకు తీరనిలోటని, బీసీలు రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే ఆయనకు తామిచ్చే నిజమైన నివాళి అని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, బీసీ మేధావుల వేదిక వరంగల్ బాధ్యులు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆయన మృతిపై ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

అప్పుల ఊబిలో మాజీ సర్పంచ్‌లు

- పెండింగ్ బిల్లులు చెల్లించని గత ప్రభుత్వం
- వడ్డీలు కట్టలేక మనోవేదన
- సొంత ఆస్తులు అమ్మి అప్పులు తీర్చుతున్న కొందరు మాజీ ప్రజాప్రతినిధులు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి



నూతనంగా నిర్మించిన కక్కిరాలపల్లి గ్రామ పంచాయతీ భవనం

ఐనవోలు : 'గత ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంతో అప్పులు తెచ్చి పనులు చేశాం. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు మెడకు చుట్టుకున్నాయి. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక, కుటుంబాన్ని పోషించే స్థితిలో కూడా లేకుండా ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టులాడుతున్నాం. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలి' అని మాజీ సర్పంచ్‌లు తమ గోడును వెల్లబోసుకున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలని గత ప్రభుత్వం సర్పంచ్‌లపై ఒత్తిడి తీసుకొచ్చిందని, గత్యంతరం లేక పతియార ఉన్న ప్రతీ ఒక్కరి నుంచి అప్పులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేశామని అంటున్నారు. ప్రస్తుతం ఏ సర్పంచ్‌ను కదిలించిన బిల్లుల కోసం ఎదురు చూస్తున్నామని బాధను దిగమింగుతున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీకి మాజీ సర్పంచ్‌లు సుమారు రూ.5 లక్షల నుంచి రూ.40లక్షల వరకు పనులు పూర్తిచేసి బిల్లులు కోసం ఎదురు చూస్తున్నారు. రెండేళ్లు గడుస్తున్నప్పటికీ సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులకు పెండింగ్ బిల్లులు విడుదల కావడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిళ్ల వస్తున్నాయని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. అధిక వడ్డీలకు తెచ్చి పనులు పూర్తిచేసిన కొందరు సర్పంచ్‌లు వడ్డీల భారం మోయలేక స్వంత ఆస్తులు అమ్ముకున్నట్లు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు వాపోతున్నారు.

బిల్లులు చెల్లించి ఎన్నికలకు వెళ్లాలి

మండల వ్యాప్తంగా 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే తాము చేసిన అభివృద్ధి పనులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు చేసిన అప్పటి సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్లులు త్వరగా వస్తాయనే ఆశతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ బిల్లులు రాకపోవడంతో కక్కలేక, మింగలేక ఇబ్బందులు పడుతున్నట్లు చర్చలు జరుగుతున్నాయి. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల క్రితమే మాజీ సర్పంచ్‌కు రావాల్సిన పెండింగ్ బకాయి వివరాలు జిల్లా కలెక్టర్ల ద్వారా తెప్పించుకున్నట్లు సమాచారం.

అన్నింట్లో ముందుండి అప్పులపాలై..

మాజీ సర్పంచ్‌లు అధికారంలో ఉన్న సమయంలో అన్నింట్లో ముందున్నారు. పల్లె ప్రకృతి వనం, వైకుంఠ ధామాలు, క్రీడా ప్రాంగణం, సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డు, సీసీ రోడ్లు, మెటల్ రోడ్డు, శిథిలమైన చోట్ల నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, మహిళ సంఘాలకు భవనాలతో పాటు ప్రభుత్వం ఆదేశించిన ప్రతీ పనిని సక్రమంగా పూర్తిచేసినట్లు గ్రామాల్లో అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికలకు ముందే బిల్లులు చెల్లించాలి



స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే ప్రభుత్వం మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి. అప్పులు తెచ్చి గ్రామాల్లో సానిటేషన్, వీధి దీపాలు, మోటార్ల మరమ్మతు, ట్రాక్టర్లకు డీజిల్, డంపింగ్ యార్డు, సీసీ రోడ్లు, ఎంఓఎంబీ పనులు, ఇతర పనులకు సుమారు 30 లక్షల వరకు అప్పు తెచ్చాను. తెచ్చిన అప్పులకు వడ్డీ పెరుగుతుండగా మానసిక క్షోభ అనుభవిస్తున్నాను. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేసి ఆదుకోవాలి.

- రమేశ్, మాజీ సర్పంచ్‌ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి, కక్కిరాలపల్లి

పార్టీలకతీతంగా పథకాల అమలు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



రేషన్‌కార్డుల పంపిణీ అనంతరం లబ్ధిదారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా ప్రతీ అర్హుడికి సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆత్మకూరు, దామెర మండలాల లబ్ధిదారులకు గురువారం నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనకు శంకుస్థాపనలు ముఖ్యం కాదని, పనులు చేయడమే ముఖ్యమన్నారు. ప్రజల ఆశీర్వాదంతో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందించే అదృష్టం దక్కిందన్నారు. పేద కుటుంబాలు ఆర్థిక ప్రగతి సాధించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. సంక్షేమపాలనను చూసి ఓర్వలేక మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్, లిక్కర్ మాఫీయా చేసిన కవిత విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు ఎన్నడూలేని విధంగా పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు.

అవినీతికి ఆస్కారం లేదు

సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవినీతికి తావులేదని ఎమ్మెల్యే అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణలక్ష్మి, ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారుల నుంచి ఎవరైనా ఒక్క రూపాయి తీసుకున్నా వారిని పక్కనబెట్టడం తప్పదని హెచ్చరించారు. ఎవరైనా అలా చేస్తే తన దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు సూచించారు. అలాగే సమావేశం ప్రారంభానికి ముందు లబ్ధిదారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో ఆర్డీఓ, తహసీల్దార్ తదితర అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నారాయణ, ఆత్మకూరు, దామెర తహసీల్దార్లు జగన్‌మోహన్‌రెడ్డి, జ్యోతివరలక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, మాజీ సర్పంచ్‌లు రాజు, రవికుమార్, మాజీ సొసైటీ చైర్మన్ రవీందర్‌గౌడ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, వాసు, రణధీర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- డాక్టర్ రుబీనా



గర్భిణులకు గోరింటాకు పెడుతున్న డాక్టర్ రుబీనా

ఎల్కతుర్తి : గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ రుబీనా అన్నారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గురువారం భీమదేవరపల్లి మండలం వంగర ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఏఎన్‌ఎమ్‌లు, ఆశ కార్యకర్తలతో కలిసి గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు మార్కెట్‌లో దొరికే కెమికల్ మెహందీ, హెయిర్ డై వాడడం వలన చర్మ సమస్యలు, అలర్జీలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. సహజ సిద్ధమైన హెర్బల్ గోరింటాకునే వాడాలని సూచించారు. చేతులకు గోరింటాకు పెట్టుకోవడం వలన చర్మ సమస్యలు నయమవుతాయని అన్నారు. అంతకు ముందు గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకోవాలని సూచించారు. ఈ వేడుకల్లో సూపర్‌వైజర్ వాణి, ఏఎన్‌ఎమ్ స్వరూప, ఆశ వర్కర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన



కంఠాత్మకూరులో పర్యటిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్

నడికూడ : మండలంలోని కంఠాత్మకూరు గ్రామంలో ఇటీవల డెంగీ కేసులు నమోదు అవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్‌తో కలిసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వీధుల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి భార్గవి, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

విదేశీయుల పర్యటన



సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పరిశీలిస్తున్న విదేశీయులు

ఐనవోలు : మండలంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విదేశీయులు పర్యటించారు. బాల వికాస ఆదర్శ పాఠశాలైన పీఎంశ్రీ ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, సేంద్రియ వ్యవసాయాన్ని సందర్శించారు. ఈనెల 14 నుంచి 26 వరకు ఫాతిమానగర్‌లో జరుగనున్న ఫ్లాగ్ షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో వీరు పాల్గొననున్నారు. ఇటలీ నుంచి ఆల్‌బర్టో, ఫ్రాన్సిస్క, నేపాల్ నుంచి అరబింద్ కుమార్ చౌదరి, చందానిషా, శ్రీలంక నుంచి కంసం ప్రియ, రోషన్, తెలంగాణ నుంచి శ్రుతి, ఛత్తీస్‌గఢ్ నుంచి ప్రఫుల్, ఆశీశ్, జమ్ముకాశ్మీర్ నుంచి రవీనా కౌసర్ తదితరులు ఉన్నారు.

'రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు పెంచాలి'



మాట్లాడుతున్న సోమన్న

ఐనవోలు : రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, బీడీ కార్మికులకు అందిస్తున్న రూ.2వేల పింఛన్లు రూ. 4వేలకు, వికలాంగులకు అందిస్తున్న రూ.4వేలను రూ. 6వేలకు పెంచాలని, అలాగే కండరాల క్షీణత బాధితులకు రూ.15 వేల పెన్షన్ అందించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా ఇన్‌చార్జ్ సోమన్న డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సింగారంలో వికలాంగుల, వృద్ధుల, వితంతువుల, ఒంటరి మహిళల చేయూత పెన్షన్‌దారుల గ్రామ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. పెన్షన్ల పెంపు సాధన కోసం ఆగస్టు 13వ తేదీన లక్షలాది మందితో నిర్వహించే సభను విజయవంతం చేసేందుకు ఈనెల 29వ తేదీన వరంగల్ జిల్లా కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి 100 మంది హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు స్వామి, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, మండల అధ్యక్షుడు అశోక్, విష్ణు, వేణు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నేడు మంత్రి రాక

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలకు శుక్రవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం తెలిపారు. వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యేకు బీజేపీ నాయకుల వినతి

ఐనవోలు : కొండపర్తి నుంచి గువ్వలగూడెం వరకు ప్రధాన మంత్రి గ్రామీణ్ సడక్ యోజన నిధులతో నిర్మించిన బీటీ రోడ్డును గురువారం ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కొండపర్తి గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు మాదాసు ప్రణయ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కొండపర్తి నుంచి భట్టుపల్లికి వెళ్లే బీటీ రోడ్డు పనులు మూడేళ్లుగా నిలిచిపోయాయని ప్రభుత్వం స్పందించి పూర్తిచేయాలని కోరారు. ఎమ్మెల్యే నాగరాజు సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

రైతులకు అందుబాటులో యూరియా



శాయంపేట : మండలంలోని రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని ఏఓ గంగాజమున తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చిన యూరియాను మండల కేంద్రంలోని వ్యవసాయ గోదాంలో నిల్వ చేసినట్లు తెలిపారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూస్తామని, 40 టన్నులు అందుబాటులో ఉందని అన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



వినయ్ (ఫైల్)

దామెర : మండల కేంద్రానికి చెందిన దామర వినయ్(28) ఆర్థిక ఇబ్బందుతో ఆత్మహత్యాయత్నాకి పాల్పడి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దామర వినయ్ ప్లంబింగ్ పని చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం తన అవసరాల నిమిత్తం రూ. 3లక్షల అప్పు చేశాడు. దీంతో అప్పు ఎలా తీర్చాలని కుటుంబ సభ్యులకు చెప్పుకుని బాధపడేవాడు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మనస్థాపం చెందిన వినయ్.. ఈనెల 15న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వినయ్ గురువారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి రాందాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

విద్యార్థులకు టై, షూ పంపిణీ



టై, బ్యాడ్జి, షూలతో విద్యార్థులు, ఎంఈఓ

ఐనవోలు : మండలంలోని వెంకటాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న సెలీనా టై, బెల్ట్, బ్యాడ్జ్, షూ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ పులి ఆనందం మాట్లాడుతూ.. రూ.35 వేల విలువచేసే వస్తువులను అందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. హెచ్‌ఎం డాక్టర్ రమేశ్, ఏపీసీ అధ్యక్షురాలు పద్మావతి, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం సరస్వతి, ఉపాధ్యాయులు పూర్ణచందర్, అశోక్‌కుమార్, రామనాథం, సూరిబాబు, ఆదిలక్ష్మి, లక్ష్మీనారాయణ, సుమలత, సంధ్య రాణి తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులపై సర్వే



గ్రామ పంచాయతీ ఆవరణలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న ఏఆర్‌ఐ రమేశ్

శాయంపేట : భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులపై గురువారం మండల కేంద్రంలోని 10మంది దరఖాస్తుదారులకు సమాచారం అందించి మోకా పైవెళ్లి సర్వే నిర్వహించినట్లు ఏఆర్ఐ రమేశ్ తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో రైతుల వివరాలను నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను కేటగిరిలుగా విభజించి పట్టా పాస్‌పుస్తకంలోని మొదటి పేజీలో పేరు, తండ్రి పేరు తప్పుపడిన వాటిని పరిశీలించేందుకు సర్వే చేస్తున్నట్లు చెప్పారు.

మహిళ అదృశ్యం



కొత్తగట్టు వజ్ర

ఆత్మకూరు : ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన కొత్తగట్టు వజ్ర మంగళవారం బంధువుల ఇంటి వద్దకు వెళ్లితిరిగి రాలేదు. భర్త, బంధువులు వెతికినా ఆచూకీ లభించలేదు. సదయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు (ఎస్సై నంబర్ 8712685252) సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

- సఖి డీవీ కౌన్సిలర్ పావని



అవగాహన కల్పిస్తున్న పావని

పరకాల : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి డీవీ కౌన్సిలర్ పావని సూచించారు. పట్టణంలోని టీజీఎస్‌డబ్ల్యూయూఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సఖి సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ.. గృహహింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు వంటి నుంచి రక్షణ పొందేందుకు సఖి సెంటర్ అందుబాటులో ఉందన్నారు. ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 181, చైల్డ్‌లైన్ నంబర్ 1098, తక్షణ సహాయం కోసం 087024552112 , 7382983088 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సఖి కేస్ వర్కర్ భారతి, ప్రిన్సిపాల్ మాధవి, వాణి, విజయ, సాహిత్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ బ్యాంకు ఖాతా పొందాలి



మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

ధర్మసాగర్ : గ్రామంలోని ప్రతిఒక్కరూ టీజీబీ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని బ్యాంకు అధికారులు కోరారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు మడికొండ బ్రాంచి ఆధ్వర్యంలో మండలంలోని మల్లకపల్లి గ్రామంలో జన సురక్ష పథకాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎఫ్‌ఎల్సీ కౌన్సిలర్ ప్రేమ్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సతీష్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు బ్యాంకులో ఖాతా ఉండాలని, జీరో అకౌంట్ ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఉందని, 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు పాలసీ పొందాలని అన్నారు. అటల్ పెన్షన్ యోజన పథకంలో 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగినవారు ప్రీమియం 60 సంవత్సరాల వరకు చెల్లిస్తే నెలకు రూ1000. నుంచి రూ.5,000 పెన్షన్ వస్తుందని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు ఏటీఎం, పిన్ నంబర్, సీవీవీ, ఓటీపీ చెప్పొద్దని అన్నారు. బ్యాంకు అధికారులు ఎట్టిపరిస్థితుల్లో ఖాతా వివరాలు, ఓటీపీలు, ఏటీఎం పిన్ నంబర్లు అడుగరని, ఖాతాదారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. బ్యాంకు అందించే పంటరుణాలు, ఇతర లోన్లు, మహిళా సంఘాల రుణాలు, బంగారంపై తీసుకునే రుణాలు, ముద్ర లోన్లు సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ సదస్సులో ఎఫ్‌ఎల్‌సీ కౌన్సిలర్, ఫీల్డ్ ఆఫీసర్, బ్యాంకు మిత్ర మాదవి, గ్రామంలోని రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పత్తిమొక్క కాండానికి బొట్టు పెట్టాలి



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ రామకృష్ణ

దామెర : మండలంలోని పులుకుర్తి గ్రామంలో పత్తిమొక్క కాండానికి బొట్టుపెట్టే పద్ధతిపై గురువారం ఏఈఓ రామకృష్ణ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పత్తిలో కాండానికి బొట్టు పెట్టడం వలన పెట్టుబడి తగ్గుతుందని, మిత్ర పురుగులు చనిపోకుండా ఉంటాయని తెలిపారు. కాలుష్యం తగ్గుతుందని, రసంపీల్చే పురుగులను నియంత్రించవచ్చని అన్నారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని ఈ సందర్భంగా సూచించారు. పంటసాగులో ఎలాంటి సందేహాలు ఉన్నా స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని అన్నారు. రైతులు వేణుగోపాల్, సతీష్, కిషన్, అంకేశ్వరపు రాంబాబు పాల్గొన్నారు.

పాఠశాలలో బోనాల వేడుకలు



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న విద్యార్థులు

కమలాపూర్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల వేడుకలను కమలాపూర్‌లోని హైటెక్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బోనాలతో డప్పుచప్పుళ్ల నడుమ గ్రామంలో ర్యాలీగా ఊరేగింపు నిర్వహించారు. విద్యార్థుల వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్‌గౌడ్, డైరెక్టర్లు రాము, మధు, కిశోర్, అనిల్, ఉపాధ్యాయులు దివ్య, పద్మ, మధుమిత, కావ్య, విద్యార్థులు పాల్గొన్నారు.